కథ

# వినదగునా ఎవ్వరేం చెప్పినా?


- పోలాప్రగడ జనార్దన్ రావు (జెన్నీ)

''అనూ...అనూ...త్వరగా రా!''

''అత్తయ్యా, మావయ్యగారు అనూ, అనూ, అని అరుస్తున్నారు. ఏదో ఒకటి అనండి. సమాధానం చెప్పకపోతే ఇంకా హడావిడి చేస్తారు.''

''వినబడుతోందమ్మా. ఆ మాయదారి దేవుడు చెవుడన్నా ఇచ్చాడు కాదు నాకు. వెళ్ళి పూజ చేసుకుంటున్నానని చెప్పమ్మా.''

''అమ్మో! నేను వెళ్ళను. మీ మాట విని వెళ్ళానంటే ఆయన మాట వింటూ కూర్చోవాలి. నాకు బోల్డు పనులున్నాయి.''



''ఏమయిపోయార్రా, వినబడ్డం లేదూ. అమ్మాయి మానసా మీ అత్తయ్య పూజ చేసుకుంటున్నాను, అని కుంటి సాకు చెబుతుందని నాకు తెలుసు. నన్ను తప్పించుకోవడానికే అది పూజ చేస్తోందనీ తెలుసు. నువ్వేనా రా అమ్మా...మా అమ్మవు కదూ... చెప్పడం మర్చిపోయానంటే అది గుర్తొచ్చేవరకూ ఏం మర్చిపోయానో గుర్తు రాక, తీరా గుర్తొచ్చాక ఏం చెప్పాలో మర్చిపోయి ప్రసవవేదన అనుభవిస్తా.... తొందరగా రా అమ్మా... నా బంగారు తల్లివి కదూ.''

''కాదు... కానే కాదు, అత్తయ్యా, తప్పదు. ఎవరో ఒకరు బలికావల్సిందే ఈ పూట మీ వంతు. అసలే ఆయనకు ఒంట్లో బాగాలేదు. డాక్టరేం చెప్పాడు మావయ్యగారు చెప్పాల్సింది మర్చిపోయారంటే అది గుర్తొచ్చే వరకు మాట్లాడుతూనే ఉంటారు. ఆయన గుండెకు అంత మంచిది కాదు అన్నారా లేదా వెళ్ళండత్తయ్యా కాస్త ధైర్యం చేయండి ప్లీజ్''

''ఎవరికి తప్పినా నాకు తప్పదుగా. ఆ దేవుడు ఎప్పుడు నా మీద దయ చూపిస్తాడో'' అంటూ గొణుక్కుంటూ మొగుడు అనబడే బి.బి.రావుగారు కూర్చున్న హాల్లోకి వెళ్ళింది. భర్త చేత అనూ...అనూ...అంటూ పిలవబడే అనసూయమ్మ.

ఆయన ఎందుకు పిలుస్తున్నారు, పిలవగానే వెళ్ళడానికి ఎందుకు అత్తాకోడళ్ళు భయపడుతున్నారు, మొదలుగు వివరాలు చిన్న బ్రేక్ తరువాత అని టివి అనౌన్సర్లా గట్టిగా అరవను. మీకు చెప్తేనే నాకు కాస్త ఆనందం. మరి కాస్త కడుపు నొప్పి తగ్గుతుంది.

బలుసు బుద్దేశ్వరావుకి చిన్నప్పటి నుంచి నాటకాలు డైరెక్ట్ చెయ్యడమంటే పిచ్చి. అడపాదడపా ఆముదాలవలసలోను, అంకిపాడు పరిషత్తుల్లో ఉత్తమ దర్శకుడి ప్రైజ్ వచ్చింది. దాంతో తాను ఆంధ్రా సత్యజిత్‌రాయ్ అనుకున్నాడు. ఓ సుముహూర్తాన ఇంట్లో డబ్బు చుట్టేసి మద్రాసు చెక్కేసాడు. వాళ్ళ దగ్గర వీళ్ళ దగ్గర అసిస్టెంట్ డైరెక్టరుగా కొన్నేళ్ళు పనిచేసాడు. పేరు కలిసి రావడం లేదని, అందరూ బుద్దూగాడు అంటున్నారని సంఖ్యాశర్మ గారి సలహా మీద బి.బి.రావు అని షార్ట్‌కట్ చేశాడు. బిఎన్ రెడ్డిగారంతటి వాడ్ని అవ్వాలని... ఒక దుర్ముహూర్తాన డైరెక్టర్ అయ్యే యోగం లేదనీ పానగల్ పార్క్‌లో చెట్టు కింద జ్ఞానోదయం అయి బుద్ధిగా మేనమామ కూతురు అనసూయను పెళ్ళి చేసుకొని ఆయన వేయించిన టీచరు ఉద్యోగం చేస్తూ స్కూల్లో పిల్లల నాటకాలు డైరెక్ట్ చేస్తూ రిటైరయ్యాడు. అదిగో అప్పట్నించి ఆయనలో ఏ మూలనో దాగి ఉన్న డైరెక్టర్ సీసాలోంచి బయటకు తన్నుకొచ్చిన రాక్షసుడిలా మళ్ళీ సినిమా ఫీల్డ్‌కి వెడదాం వెళ్ళు, వెళ్ళు అన్నాడు. కాని శరీరం సహకరించక కూర్చో కూర్చో అంది. ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. పెద్దాడు స్వామి అసిస్టెంట్ కెమెరామెన్. చిన్నాడు చిన్నారావు, సినిమా ప్రొడక్షన్ మేనేజర్. కూతురికి పెళ్ళి అయింది... అదీ ఫ్లాష్ బ్యాక్.

ఇంక గతంలోంచి టివి గదిలోకి వద్దాం. ''చూడు అటు చూడు ఆ షాట్ ఎంత బాగా తీసాడో. నదిలో బోటులో కృష్ణుడు, రుక్మిణి విహారం చేసే సీను. మధ్యాహ్నం ఎండలో తీసాట్ట మార్క్స్‌బార్ట్లే అనే కెమెరామెన్ కాని వెన్నెట్లో తీసినట్లు ఉంటుంది'' అంటూ మాయాబజార్ సిడి స్టాప్ చేసి చెప్పడం మొదలుపెట్టాడు. బిబిరావు సోషల్ మాష్టారు మ్యాప్ పాయింటింగ్ చూపించినట్లు ఓ కర్ర పుల్లతో టివిలో నీళ్ళను చూపిస్తూ.

''అబ్బా ఈ విషయం ఇప్పటికి వందసార్లు చెప్పారు. సినిమా పూర్తిగా చూడనివ్వరు. డైలాగులు విననివ్వరు, చస్తున్నా మీతో వేగలేక'' అంటూ తప్పని పరిస్థితుల్లో సణుక్కుంటూ ఆయన పక్కన కూర్చుంది.


''పోనీ, మల్లీశ్వరి సిడి పెట్టనా?''

''ఏ సినిమా అయితే ఏముంది బుర్ర పాడు చేసుకోడానికి''

''ఏమిటో నాకు తెల్సింది మీతో పంచుకోవాలని అలా అలా మాటలు తన్నుకొచ్చేస్తాయి. ఈసారి అలా చేయను ప్రామిస్ చూడు... చూడు'' అంటూ టెంపరరీగా గొంతుకి రెస్ట్ ఇచ్చాడు బి.బి.రావు.

''ఓహో సుందరి.. అహా సుందరీ నీ వంటి దివ్య స్వరూపం'' అంటూ పాట మొదలైంది. ఇద్దరూ హాయిగా నవ్వుకుంటున్నారు. ఇంతలో సిడి ఆగింది. ఆగింది అనే కంటే ఆపు చేసాడు అనడమే సమంజసం.

మళ్ళీ మొదలయింది అనుకుంటూ అక్కడ్నించి వెళ్ళిపోవడానికి సిద్ధమయింది అనసూయమ్మ. రిలీజ్ అయిన మొదటి రోజే మొదటి ఆటకే ఇంటర్వెల్‌లో వెళ్ళి తిరిగిరాని ప్రేక్షకుల్ని చూసిన ప్రొడ్యూసర్‌లా ఆవిడ చెయ్యి పట్టుకొని జాలిగా, బాధగా, దుఃఖంగా తన మొఖంలో పలకగలిగిన భావాలన్నింటిని కలగలిపి ఆవిడకేసి చూసాడు.



పాపం అన్ని భావాలు కాక్‌టైయిల్ అయి ఆయన మొఖంలో కనిపించేసరికి అసలు భావం తెలిసిన అర్ధాంగి కాబట్టి తప్పనిసరి అయి ఊ ఇంక మొదలుపెట్టండి అన్నట్టు మొహం పెట్టి కూర్చుంది.

''ఇది విను రేలంగి గారు ఓసారి తను యాక్ట్ చెయ్యబోయే సీను చదివి ''అబ్బే దీంట్లో కామెడి ఎక్కడుంది? ఎవరు రాసారు?'' అని అడిగార్ట.

''నేనేనండి'' అన్నాట్ట గొప్పగా పక్కనే ఉన్న రైటరు.

''నువ్వు రాసావా? నువ్వయితే బాగానే రాస్తావు. వాడేమో అనుకున్న'' అన్నార్ట, దూరంగా ఉన్న వాణ్ణి చూపించి.

''ఇది కూడా చాలా సార్లు చెప్పింది. చెప్పిందే చెప్పడం మీకలవాటు. విన్నదే వినడం నా గ్రహపాటు.''

''ఏం చెయ్యమంటావు చెప్పు, నాకు గుర్తుండడం లేదు. అది సరే అమ్మాయి, పిల్లలు పండక్కి వస్తున్నారా?''

''రానందండి.''

''ఎందుకు రానంది... మనం ఏం తక్కువ చేసాం దానికి.''

''అన్నీ ఎక్కువే చేసాం. అందుకే రానంది. క్రిందటి సారి పండక్కి వచ్చినప్పుడు పిల్లల్ని కదలనియ్యకుండా కూర్చోబెట్టి, మభ్యపెట్టి చాక్లెట్లు, చిప్స్, వేరుశెనక్కాయలు పెట్టి పాత సినిమాలు చూపించార్ట. పిల్లలు మీరు పెట్టిన అడ్డమైన గడ్డి తిని ఇంటికెళ్ళి అడ్డం పడ్డార్ట. అందుకని ఈ సారి ససేమిరా రానంది. అయ్యో దేవుడి దగ్గర దీపం పెట్టడం మర్చిపోయా. ఇప్పుడే వస్తా'' అంటూ అంతర్ధానమయ్యింది అనసూయమ్మ. అప్పుడే వచ్చాడు పక్కింటి రామనాథం. బోనులో బజ్జి తినడానికి వచ్చిన దొంగ ఎలకలా,

''రా!రా! రామనాథం టైముకొచ్చావు. అనూ రామనాథం వచ్చాడు. కాఫీ పట్టుకురా. ఇదిగో రామనాథం 'పూజాఫలం' సినిమా చూడు. ఇప్పుడే పెట్టా సిడి. ఆ కామెడి క్యారెక్టరు వేసిన వాడు ఎవడనుకుంటున్నావు. పొట్టి ప్రసాదు. సినిమాలో ఎంత కామెడీ ప్రొడ్యూస్ చేస్తాడో బయట అంతకంటే ఎక్కువ. ఈ ప్రాక్టికల్ జోక్ విను. కొత్తగా పెళ్ళి అయిన మిత్రుడు భార్యను తీసుకొని పొట్టి ప్రసాద్ ఇంటికి వెళ్ళాట్ట. గుమ్మంలో ఎదురైన ప్రసాదు ''ఏంట్రా అప్పారావు చెప్పాపెట్టకుండా ఈ వేళప్పుడు వచ్చావు'' అన్నాట్ట. ''మా ఆవిణ్ణి తీసుకొచ్చా గురూ'' అన్నాట్ట అప్పారావు. ''బలే వాడివే మా ఆవిడ ఇంట్లోనే ఉంది'' అన్నాట్ట ప్రసాదు. బలే బండ జోకు కదూ!'' ఇంతలో కాఫీ వచ్చింది.

''చూడరా! క్రేన్ వేస్తే ఎంత బావుండేదో ఈ షాట్‌లో'' అన్నాడు రావు టివిలో సినిమా చూస్తూ.

''నే వెళ్ళి కొనుక్కుంటాలే వెధవది రూపాయేగా'' అంటూ తుర్రమన్నాడు రామనాథం. కాఫీ డబ్బులు మిగుల్చుకొని.

"వీడెప్పుడూ ఇంతే. తాగడానికో, తినడానికో వస్తాడు. నేను చెప్పేది వినడు. ఇలాంటి ప్రేక్షకులు ఉండబట్టే గొప్ప కళాఖండాలు తియ్యలేక పోతున్నారు." అని కళ్ళు మూసుకుని బాధపడ్డాడు. తెలుగు ప్రేక్షకుడి అదృష్టం కొద్దీ గ్రేట్ డైరెక్టర్ అవని బి.బి.రావు

మావగారు నిద్దరపోతున్నారని ధైర్యంగా కాఫీ గ్లాసులు తీసుకెళ్ళడానికి వచ్చిన కోడలు మానస దొరికిపోయింది ఆయనకు. "అమ్మాయి మానసా, ఈ రంగనాథం ఎప్పుడూ అంతే. చూడు చూడు పొట్టి ప్రసాద్‌ని, ఓ సారి ఏమయిందంటే డైరక్టరు "ఏమండి ప్రసాద్ గారు పక్క క్యారెక్టర్అంత బ్రహ్మాండంగా యాక్ట్ చేస్తోంటే మీరు రియాక్ట్ అవరేమిటి" అన్నార్ట. దానికి పొట్టి ప్రసాద్ "మనం యాక్షన్‌కే రెమ్యునరేషన్ మాట్లాడుకున్నాం. రియాక్షన్‌కి కాదు" అన్నాట్ట. అవునూ... చూడు జమునకి డైరెక్టర్ క్లోజప్ ఎందుకిచ్చాడంటావు?"

"ప్రొద్దుటే పళ్ళు తోముకోవడానికండి" అంది అమాయకంగా.

ఇంతలో మానస అదృష్టం కొద్దీ కరెంట్ కట్ అయింది. అనుమానంగా గోడ వైపు చూస్తే అత్తగారి హస్తం కనపడింది. 'ఫ్యూజ్' చేత్తో అభయమిస్తూ. ఇల్లాంటి యమర్జెన్సీ గురించే ఫ్యూజ్ వైరు రెడీగా పెట్టుకున్నాడు బి.బి.రావు.

పిల్లలు, పశువులు ఇంటికొచ్చే వేళ అయింది. పిల్లలు పుస్తకాల సంచులు ఇంట్లోకి విసిరేసి "తాతగారూ సిడి పెట్టండి. సినిమా చూపించండి" అంటూ మారాం చేసారు. చిరు(తిళ్ళ) ప్రేమ ఒలకపోస్తూ.

సిడి పెట్టి "ఒరేయ్ కన్నా ఆ సెట్టింగు చూడరా, ఎంత అద్భుతంగా ఉందో, సీనియర్ ఎన్‌టిఆర్ గారు ఆర్ట్ డైరెక్టర్ని పిలిచి ఏం బ్రదర్ సెట్టింగంతా ఏనుగుల తోరణాలతో నింపేశారేమిటి?" అని అడిగార్ట. అప్పుడు ఆ డైరక్టర్ "ఇది హస్తినా పురి కదండి. అందుకే అన్నీ ఏనుగులే" అన్నాట్ట. ఇది తనకి తప్ప ఇంకెవరికి తెలియదు అన్నట్ట ఫోజు పెట్టాడు డైరెక్టర్ రావు.

"అప్పుడు ఎన్‌టిఆర్ గారు మరి పెంటపాడులో జమీందారు గారి ఇల్లు సెట్ వేయమంటే ఎలా వేస్తావు అని అడిగార్ట కదూ. తాతగారూ మాకు టిఫిన్లు పెట్టండి" అంటూ మనవడు మారాం చేశాడు.

"నేను పెడతాన్రా టిఫిను" అంటూ వాళ్ళమ్మ వాడి పిర్ర మీద రెండట్లు ఫఠీ ఫఠీ మని వేడి వేడిగా వేసి బరబరా ఇంట్లోకి లాక్కుపోయింది.

ఏడుస్తూ వెడుతున్న మనవడ్ని చూసే సరికి ఆయన మనస్సు పాడైపోయింది. ఆరోజు మొదలు ఎవరూ ఆయన దగ్గరకి రాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు ఇంటిల్లపాది. దాంతో ఆయనకు ఒళ్ళు మండి వీధిలోకి వచ్చే ముష్టాళ్ళనీ, ముగ్గు అమ్ముకునే వాళ్ళని, సాధువుల్ని, సంతకెళ్ళే వాళ్ళని ఒకళ్ళు అని ఏముంది వీధిలోకి ఎవరొస్తే వాళ్ళని ఇంట్లోకి పిలిచి కూర్చోబెట్టి డబ్బులిచ్చి పాత సినిమాలు చూపించి తన డైరెక్టర్ టచ్ ఇవ్వడం మొదలు పెట్టాడు. ఇది గమనించి కుటుంబ సభ్యులు షిఫ్ట్ సిస్టమ్‌లో వీధిలో కాపలా కాసి ఈ వీధికి కర్ఫ్యూ పెట్టినట్టు చేసారు.

మనుషులు కరువయ్యే సరికి ఆయనకి మతి పోయినట్టు అయ్యింది. శూన్యంలోకి చూడ్డం, వెర్రి నవ్వు నవ్వుకోవడం, యాక్షన్ కట్ అనుకోవడం, అస్తమానం చేతి బొటన వేలుతో చూపుడు వేలు రిమోట్ నొక్కినట్లు నొక్కుకోవడం మొదలుపెట్టాడు.

తండ్రి బాధ చూడలేక రెండో కొడుకు ఓ రోజు నలుగురు మనుష్యుల్ని తీసుకొచ్చి, "నాన్న వీళ్ళకి పాత సినిమాలంటే యమ పిచ్చి. నువ్వు వాళ్ళకేం ఇవ్వక్కర్లేదు, పెట్టనక్కర్లేదు. ఇంక చూపించు నీ సిడిలు. వినిపించు నీ అనుభవాలు" అంటూ వెళ్ళిపోయాడు.

వాగే వాడికి మైకు దొరికినట్టు, పొలిటీషియన్‌కి ఓటు దొరికినంత సంబరపడిపోయాడు రావు. సిడి ఊసూరు మంటూ ఎన్ని సార్లు తిరగాలో నా ఖర్మ అంటూ ఏడుస్తూ తిరగడం మొదలైంది. "అడుగో రమణారెడ్డి. ఆయన ఓసారి రాజుబాబుతో షూటింగు అయిపోయిందిగా వెళ్ళిపోక ఇంకా ఉన్నావే" అన్నార్ట. దానికి రాజుబాబు 'క్యాషియర్' వస్తాడని ఆగాను అన్నాడు. దీనికి రమణారెడ్డి ఈ కంపెనీలో క్యాష్ఇవ్వరు అన్నార్ట." అహ్హ అహ్హ అంటూ గట్టిగా నవ్వాడు రావు ఆయన ఏం చెబుతున్నా 'ఊ' అనరు 'ఆ' అనరు ఆ వచ్చిన నలుగురు. అసలు రియాక్షన్ లేకపోయే సరికి ఒళ్ళు మండిపోయి,

"ఏంటయ్యా మీరు నేను ఏం చెప్పినా రియాక్టవ్వరు"

"సార్ మీరు చాలా గొప్ప డైరెక్టరు అవబోయి ఆగిపోయారని, మీరు ఏం చెబితే అది చెయ్యమన్నారు మీ అబ్బాయిగారు. మీరు మమ్మల్ని ఏం చెయ్యమని చెప్పడం లేదు...యాక్షన్ కట్ అని చెప్పాలి... మేం సీనియర్ మోస్ట్ జూనియర్ ఆర్టిస్టులం. చెబితేనే చేస్తాం."

ఒళ్ళు మండిపోయి వాళ్ళని పొమ్మన్నాడు రావు.

"మేం పేకప్ చెబితే కాని వెళ్ళం. మళ్ళీ మా యూనియన్‌లో గొడవలొస్తాయి."

"పేకప్" అని గట్టిగా అరిచి వాళ్ళను పొమ్మన్నాడు.

బి.బి.రావు గార్కి బుర్ర తిరిగింది. శ్మశాన వైరాగ్యంలా డైరెక్షన్ వైరాగ్యం అనే వైరస్ ఆయనలో ప్రవేశించింది.

నేనీ ప్రపంచంలోకి ఒంటరిగా వచ్చాను. ఒంటరిగానే నా ప్రయాణం. సంతోషం అంటే ఏమిటో తెలియని వాడి గురించి నేనెందుకు దుఃఖపడాలి. నా ఆనందాన్ని నేనే అనుభవిస్తాను. నా అనుభవాల్ని నేనే నెమరేసుకుంటాను. "నవ్వలేని వాళ్ళ గురించి నేనెందుకు నవ్వుల పాలవ్వాలి" అనుకుంటూ 'దేవదాసు' సిడి పెట్టి సినిమా చూస్తూ ఆ విషాదాన్ని భరించలేక, నాగేశ్వరావు నటనకి తన్మయత్వం చెందుతూ గుండె బరువెక్కి హృదయం వేడెక్కి దేవదాసు ప్రాణాలు ఎలా పోయాయో డైరెక్టర్ వ్యూలో డిటెక్ట్ చేస్తూ సోఫాలో వాలిపోయారు బి.బి.రావు.

ఇంటిల్లిపాది భోరుమన్నారు.

డైరెక్టరు తాతయ్య ఎందుకు అలా పడిపోయాడు. మనకేం చెప్పాడా? ఏం పెట్టారా? అన్నట్టు బితుకు బితుకుమంటూ చూస్తున్నారు మనవలు.

అందుబాటులో వేరే గుడ్డల్లేక చీర కొంగు నోట్లో కుక్కుకొని ఏడుస్తోంది అనసూయమ్మ.

"నాన్నా అంతిమ యాత్ర కెమెరాలో బంధించి ఆ సిడి వీధిలో వాళ్ళందరికి పదోరోజు భోజనం పెట్టి చూపిస్తానని" కళ్ళమ్మట నీళ్ళెట్టుకొని ఓపెన్‌గా డిక్లేర్ చేసాడు పెద్దకొడుకు అసిస్టెంట్ కెమెరామెన్ స్వామి.

"నాన్నా మమ్మల్ని ఇన్నేళ్ళు నీ అనుభవాలతో ఇంత ఏడ్పించి, అంత సునాయాసంగా వెళ్ళిపోయావా" అని లోపల లోపల అనుకుంటూ పైకి మాత్రం భోరున ఏడుస్తూ తండ్రిని కౌగిలించుకుని కుదిపేశాడు చిన్నకొడుకు చిన్నా.

కొడుకు కుదుపులకి చావు మూడ్‌లోంచి బతికి బయటకొచ్చి, "నా మీద మీకెంత ప్రేమర్రా... దేవదాసు ప్రాణాలు కళ్ళల్లోంచి పోయాయి. ఆ షాట్ అల్లా కాకుండా మొహం కెమెరాకి ఫేస్ చేసి పోతే ఎలా ఉంటుందోనని నేను రిహార్సల్సు వేసుకున్నా. మీరంతా నేను నిజంగానే పోయారనుకున్నారంటే డైరెక్టరుగా నేను సక్సెస్ అయినట్టే. నాకు కాన్ఫిడెన్స్ వచ్చింది. నా టాలెంట్ వృథా అవడానికి వీల్లేదు. మనమే సినిమా తీద్దాం. పెద్దాడు కెమెరామెన్. చిన్నాడు ప్రొడక్షన్ చూసుకుంటాడు. ఆస్తి అంతా అమ్మేస్తా. నీ బంగారం అమ్మేస్తా" అంటూ అనౌన్స్ చేశాడు బి.బి.రావు.

ఆ షాట్‌కి షాకైన ఇంటిల్లిపాది అడుక్కుతినే సీన్ ఊహించుకొని ఊపిరి తీసుకోవడం మర్చిపోయారు.

*

రచయిత సెల్ నెం:9849142361

